
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

5 సిద్దిపేట
గురువారం 30 జనవరి 2025

## పలువురు తహసీల్దార్ల బదిలీ

గజ్వేల్, జనవరి29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ మనుచౌదరి బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. నంగునూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న సరితను కుకునూరుపల్లికి, కుకునూరుపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న మల్లికార్జున్‌రెడ్డిని అక్బర్‌పేట-భూంపల్లి తహసీల్దార్‌గా, అక్బర్‌పేట-భూంపల్లి తహసీల్దార్ పి.చంద్రశేఖర్‌ను గజ్వేల్ ఆర్డీవో కార్యాలయ డీఏవోగా, గజ్వేల్ ఆర్డీవో కార్యాలయ డీఏవోగా పనిచేస్తున్న డి.సుజాతను నంగునూరు తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


కూడవెల్లి వాగులో మాఘస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

## వెల్లివిరిసిన ఆధ్యాత్మికం

- భక్తిశ్రద్ధలతో మాఘ అమావాస్య
- ఏడుపాయల, కూడవెల్లికి పోటెత్తిన భక్తజనం
- ఆలయాల కోనేర్లలో పుణ్యస్నానాలు
- దర్శనం కోసం బారులు

7, 8


కోహెడ మండలం సింగరాయ జాతరలో లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

## జనసంద్రమైన సింగరాయ

- జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు
- కిటకిటలాడిన మోయ తుమ్మెదవాగు
- తోపులాటలో పలువురు మహిళలకు గాయాలు ఇద్దరు యువతులకు అస్వస్థత

7

### భూ సేకరణ ప్రక్రియ
## వేగంగా పూర్తవ్వాలి : కలెక్టర్




సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ రిజర్వాయర్ల డిస్ట్రిబ్యూషన్ కెనాల్ భూసేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్‌కు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ కెనాల్ భూసేకరణ ప్రక్రియపై ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రిజర్వాయర్ కెనాల్ గురించి పూర్తి వివరాలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని పంపిణీ ప్రక్రియకు సంబంధించిన మేజర్ కెనాల్ పనులు దాదాపు పూర్తయినట్లు చెప్పారు. మైనర్, సబ్‌మైనర్ కెనాల్ యొక్క భూసేకరణ ప్రక్రియ పూర్తయితే జిల్లాలో ఆయకట్టు గణనీయంగా పెరిగే ఆస్కారం ఉందని తెలిపారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు టీంగా ఏర్పడి ఆయా గ్రామాల్లో కాలువల భూసేకరణ వేగంగా జరపాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీత, ఆర్డీవో సదానందం, ఇరిగేషన్‌శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కూడవెల్లి ఆలయ
## చైర్మన్ ఎన్నికపై సస్పెన్స్!

దుబ్బాక, జనవరి29 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి కూడవెల్లి రామలింగేశ్వరాలయ పాలకమండలి చైర్మన్ ఎన్నికపై సస్పెన్స్ వీడడం లేదు. మంగళవారం అర్ధరాత్రి వరకు ఆలయ ప్రాంగణంలో జరిగిన హైడ్రామా అనంతరం చైర్మన్ ఎన్నికల జరిగిందా..? జరగలేదా..? అనేది తేలడం లేదు. అంతా వెళ్లిపోయాక పాలకమండలి సభ్యులు తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని, అర్ధరాత్రి ప్రమాణస్వీకారం చేశానని బుధవారం నూతన చైర్మన్ అభ్యర్థి ఉషయ్యగారి రాజిరెడ్డి ప్రకటించారు. ప్రక్రియ పూర్తికాలేదని, రాత్రి ఎన్నిక జరిగిన మాట వాస్తవమేనని, ప్రతిపాదకులు లేరనీ దేవాదాయశాఖ అధికారులు చెబుతున్నారు. అధికారులు తీర్మాణం పుస్తకంలో, దేవాలయ మినిట్ బుక్‌లో మాత్రం ప్రతిపాదకుల స్థానంలో ఖాళీగానే ఉంచారు. అయితే అనధికారికంగా చైర్మన్ రాజిరెడ్డి ఎన్నిక ఖరారు అయినప్పటికీ, సాంకేతికంగా ప్రక్రియ అసంపూర్తిగానే ఉందని చెబుతున్నారు. ఉషయ్యగారి రాజిరెడ్డి మాత్రం హాజరైన ఆరుగురు సభ్యులతో కలిసి చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసి తెల్లవారుజామున 3 గంటల నుంచి ఆలయ క్షేత్రంలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిసింది.

# రేసులో మేము సైతం..

మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు పోటాపోటీ


ఫిబ్రవరి 3న నోటిఫికేషన్, 27న పోలింగ్, మార్చి 3న ఫలితాలు

గ్రాడ్యుయేట్లను ఆకర్షించేలా ప్రచారం

టీచర్ల స్థానంపై పీఆర్‌టీయూ ఫోకస్

బీజేపీ అభ్యర్థుల ప్రకటన.. డైలమాలో కాంగ్రెస్, బీఆర్ఎస్

**మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్‌తోపాటు అదేరోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. ఫిబ్రవరి 27న పోలింగ్.. మార్చి 3న ఫలితాలు వెల్లడిస్తారు. ఈ నేపథ్యంలో ఆశావహులంతా నడుం బిగించారు. రేసులో మేమూ ఉన్నామంటూ ప్రచార ఆర్భాటాలపై దృష్టిపెట్టారు. ఇటు పట్టభద్రులను, అటు ఉపాధ్యాయులను ఆకర్షించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు.**





ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 29: నెలరోజుల పాటు ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల మైకులు మార్మోగనున్నాయి. పట్టభద్రులు, ఉపాధ్యాయులు విద్యావంతులే కావడంతో ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, పట్టభద్రులు తమ ఆలోచనలను వెల్లడించడంతో పాటు పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్షాల వైఖరిపై ఓటు ద్వారా తమ తీర్పును ఇవ్వబోతున్నారు.

### పట్టభద్రుల కోసం ప్రచారహోరు

గ్రాడ్యుయేట్ ఓటర్లను ఆకర్షించడానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ రేసులో ఉన్నవారంతా విభిన్న శైలిలో ప్రచారం చేపట్టారు. గడిచిన ఆరునెలల కాలంగా ఫ్లెక్సీలు, సోషల్ మీడియా, పత్రికలు, ఛానళ్లలో తమ ప్రస్తావన ఉండేలా చూసుకుంటున్నారు. వివిధ ఫౌండేషన్ల ద్వారా నిరుద్యోగులను, యువతను ఆకర్షించే కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో సమావేశాలను ఏర్పాటు చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థల లెక్చరర్లు, టీచర్లు, ఉద్యోగులు, యువతీ యువకులకు అవగాహన కల్పించారు. తమను గెలిపిస్తే చేపట్టబోయే అంశాల గురించి విప్పిచెప్పే ప్రయత్నం చేశారు. ప్రధానంగా ప్రైవేట్ స్కూల్స్ టీచర్ల సంఘం ట్రస్మా నేత యాదగిరి శేఖర్‌రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసిన ప్రసన్న హరికృష్ణ, డీఎస్పీ పోస్టుకు విఆర్ఎస్ తీసుకున్న గంగాధర్, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, ఐఎంఏ మాజీ చైర్మన్ డాక్టర్ బీఎన్ రావు రేసులో ఉన్నారు. మరోవైపు బీజేపీ తమ అభ్యర్థిగా ఆ పార్టీ నేత చిన్నమైలు అంజిరెడ్డిని ప్రకటించింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులెవరోననే ఉత్కంఠ నెలకొంది.

| ఓటర్ల వివరాలు ఇవే.. | | |
|---|---|---|
| జిల్లా | ఉపాధ్యాయులు | పట్టభద్రులు |
| సంగారెడ్డి | 2,621 | 23,500 |
| మెదక్ | 1302 | 12,183 |
| సిద్దిపేట | 3,068 | 32,133 |
| మొత్తం | 6,991 | 67,816 |



### ఉపాధ్యాయ ఎమ్మెల్సీపై ఫోకస్

గత ఎన్నికల్లో సిద్దిపేటకు చెందిన కూర రఘోత్తమరెడ్డి పీఆర్‌టీయూ తరఫున ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయం సాధించారు. ఈసారి కూడా సిద్దిపేటకే చెందిన వంగ మహేందర్‌రెడ్డిపేరును ఆ సంఘం అభ్యర్థిగా ప్రకటించింది. ఇతర అనుబంధ సంఘాల మద్దతునూ కూడగడుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో మెజార్టీ ఓటర్లు పీఆర్‌టీయూ సంఘ సభ్యులవే ఉంటాయనే ధీమాతో ఆయన ప్రచారం చేస్తున్నారు. మళ్లీ ఈస్థానాన్ని నిలబెట్టుకోవాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఇక విద్యాసంస్థల అధినేత

మిగతా 7వ పేజీలో..


విద్యుత్‌దీపాలతో అలంకరించిన ముర్షద్‌గడ్డ దర్గా

### ముర్షద్‌గడ్డ దర్గా
## ఉర్సు ప్రారంభం

సిద్దిపేట కల్చరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలోని ముర్షద్‌గడ్డ దర్గా ఉర్సు ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో మొదటిరోజు గంధరాధనతో మొదలయ్యాయి. ఉత్సవాల నేపథ్యంలో దర్గాను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. పట్టణంలో గంధం ఊరేగింపు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ఖవ్వాలి పాడుతూ ఊరేగింపు చేపట్టారు. ఉత్సవాల నేపథ్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఠాధిపతి ఖాజా మహ్మద్ హకీం షరీఫ్ చిష్తి, హఫెజ్ ఖైరాబాద్ పీఠాధిపతి సయ్యద్ పర్కాన్ షష్మీ, సయ్యద్‌పల్లి పీఠాధిపతి సయ్యద్ ముక్తార్ హుస్సేనీ, ఖాజా మహ్మద్ సాబెర్ షరీఫ్ (ఇల్యాస్ బాబా) తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేటలో గంధం ఊరేగిస్తున్న నిర్వాహకులు



### మెదినీపూర్ సబ్‌సెంటర్..
## ప్రారంభానికి నోచుకునేదెన్నడో?

- మూడేళ్ల క్రితం కుకునూరుపల్లికి 3 సబ్‌సెంటర్లు మంజూరు
- మెదినీపూర్‌లో పనులు పూర్తయినా సౌకర్యాలు లేక ప్రారంభం కాని వైనం

8

### విద్యాధరి ఆలయ
## అభివృద్ధికి సహకరిస్తా

- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- వసంత పంచమి వేడుకలకు ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు

# దైవదర్శనానికి వెళ్తూ.. మృత్యుఒడికి

- కల్వర్టును ఢీకొన్న కారు.. ముగ్గురి దుర్మరణం
- ఆరుగురికి తీవ్రగాయాలు
- పెద్దపల్లి జిల్లా కాట్నపల్లి శివారులో ప్రమాదం
- మృతులు సిద్దిపేట జిల్లా వాసులు
- డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణం


పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ గ్రామశివారు కాట్నపల్లిలో కల్వర్టును ఢీకొన్న కారు

సుల్తానాబాద్, జనవరి 29: (ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వెళుతున్న వారిని రోడ్డుప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ఆలయ దర్శనానికి బుధవారం తెల్లవారుజామున ఓ కుటుంబం కారులో బయలుదేరింది. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లా కాట్నపల్లి శివారులో కారు కల్వర్టును ఢీకొంది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు.

సిద్దిపేటలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన ఆకుల కనకయ్య (60) ఆయన భార్య తార (50)తో పాటు వారి కుమారుడు ఆకుల శ్రీనివాస్, వియ్యంకుడు జంగిటి జనార్దన్ (45) ఆయ న భార్య రమాదేవి, వీరి కుమారుడు జంగిటి మనోజ్‌కుమార్, ఆకుల మాన్విత, ఆకుల ఆర్యన్ దైవదర్శనం కోసం బయలుదేరారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారిపై కారు కల్వర్టును ఢీకొంది. వేగంగా ఢీ కొనడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. కారు ముందు సీట్లలో కూర్చున్న ఆకుల కనకయ్య, తార దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన జంగిటి జనార్దన్‌ను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆకుల శ్రీనివాస్, రమాదేవి, ఆర్యన్, మాన్విత, మనోజ్‌కుమార్‌తో పాటు డ్రైవర్ బాల్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు

# రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు పోరు..

- నేడు చేర్యాలలో మహాధర్నా
- జనసమీకరణతో విజయవంతంపై ఎమ్మెల్యే పల్లా దృష్టి
- ఏర్పాట్లు పరిశీలించిన జేఏసీ నాయకులు
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు రాక


చేర్యాలలోని అంగడిబజారు చౌరస్తా వద్ద మహాధర్నా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేఏసీ నాయకులు

చేర్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చేర్యాల ప్రాంత ప్రజల చిరకాలవాంఛ అయిన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో నేడు ఆందోళన చేపడుతున్నారు. స్థానిక గాంధీచౌక్ నుంచి అంగడిబజారు చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టిన అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కూడలి వద్ద మహాధర్నా నిర్వహించనున్నారు. అందుకు జేఏసీ నాయకులు నాలుగు మండలాల్లో విస్తృత ప్రచారం చేపట్టడంతో పాటు స్థానిక అంగడిబజారు వద్ద ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి మద్దతు కూడబెట్టేందుకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, పలువురు ఎమ్మెల్సీలతో పాటు ప్రతిపక్ష నేతలను ఆహ్వానించారు. రెవిన్యూ డివిజన్ విషయంలో ఆది నుంచి తన దైన శైలిలో గొంతువినిపిస్తు న్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మహాధర్నా విజయవంతంపై స్పెషల్ ఫోకస్ చేశారు. భారీ జనసమీకరణ నిమిత్తం ప్రత్యక్ష చర్యలు చేపట్టారు. జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్యపంతులు, నాయకులు ఆముదాల మల్లారెడ్డి, బూరుగు సురేశ్ తదితర నాయకులు మంగళవారం దీక్ష స్థలాన్ని బుధవారం పరిశీలించి ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఇంటికొక్కరు చొప్పున కదలి రావాలని కోరారు. మరో జేఏసీ ఆధ్వర్యంలో కొద్ది రోజులక్రితం ఇదే అంగడిబజారు చౌరస్తాలో ఒకరోజు దీక్ష చేపట్టి కలెక్టర్ కార్యాలయానికి బైక్‌ర్యాలీగా వెళ్లి ఆందోళన చేపట్టారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు మంత్రులను కలిసి చేర్యాల డివిజన్ ఏర్పాటుకు వినతిపత్రం సమర్పించారు. ఇటీవల రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు విషయమై ప్రభుత్వం కలెక్టర్ల ద్వారా ఫిజిబులిటీ రిపోర్ట్ కోరింది. వేర్వేరు జేఏసీలుగా ఏర్పడి ఎవరికి వారుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా అందరి లక్ష్యం అన్నిఅర్హతలున్న చేర్యాలను డివిజన్ కావడమే. మరీ ప్రభుత్వం మదిలో ఏముందో అన్న విషయం సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

### హాజరుకానున్న ఎంపీ

నేటి. మహాధర్నాకు మద్దతుగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు హాజరుకానున్నారు. ఈవిషయమై బీజేపీ రాష్ట్ర నాయకుడు బూరుగు సురేశ్ విలేకరులకు తెలిపారు.

## ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేరండి

నర్సాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మామూలుగా ప్రైవేటు కాలేజీల వారు తమ కాలేజీలలో చేర్పించాలంటూ ప్రచారం చేయడం తెలుసు.. కానీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అధ్యాపకులు కూడా విద్యార్థులను చేర్పించుకోవడానికి ప్రచారం చేయడం విశేషం. నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ దామోదర్ ఆధ్వర్యంలో అధ్యాపక బృందం బుధవారం ప్రచారం ప్రారంభించారు.

## ప్రారంభానికి పోచమ్మ ఆలయం సిద్ధం

పెద్దశంకరంపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దశంకరంపేట ప్రియాంక కాలనీలో నిర్మించిన పోచమ్మ ఆలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈనెల 30, 31వ తేదీల్లో పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 30న గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, నవగ్రహ పూజలు, 31న యంత్ర ప్రతిష్ఠాపన అమ్మవారి ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమాలుంటాయన్నారు.

## కారు బీభత్సం

- మద్యం మత్తులో కారు నడిపిన డ్రైవర్
- ద్విచక్రవాహనదారులకు గాయాలు

జోగిపేట, జనవరి29(ఆంధ్రజ్యోతి): జోగిపేటలో ఓ కారు బీభత్సం సృష్టించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు మొగులయ్య బొడ్మట్‌పల్లి నుంచి సంగారెడ్డికి తన సొంత కారులో బయలుదేరాడు. కారును జోగిపపేటకు చెందిన డ్రైవర్ మూసా నడుపుతున్నాడు. జోగిపేట పట్టణంలోని హనుమాన్ చౌరస్తా వద్దకు రాగానే మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ వేగంగా, అజాగ్రత్తగా కారును నడుపుతూ రెండు ద్విచక్రవాహనాలు ఢీకొడుతూ, రాంగ్‌రూట్‌లో వెళ్లి టీడీపీ జెండా గద్దెను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్రవాహనాలపై వెళ్తున్న సంజీవులు, బాలయ్య, రాజు అనే వ్యక్తులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్ఐ పాండు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రమాదానికి కారణమైన కారు

## వ్యక్తిపై పోక్సో కేసు

ఐడీఏబొల్లారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : బాలికకు మాయ మాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడిన ఓ కార్మికుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైన సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ రవీందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పెద్ద కోడప్గల్ గ్రామానికి చెందిన కడారి తరుణ్(20) ఐడీఏబొల్లారం చర్చి బస్తీలో నివాసముంటున్నాడు. కొంతకాలంగా ఓ బాలికకు చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సోతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## జపాన్‌లో సైన్స్ ప్రోగ్రాంలో బీవీఆర్ఐటీ విద్యార్థులు

నర్సాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కాలేజీకి చెందిన మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ చెందిన విద్యార్థులు జపాన్‌లోని సకురా సైన్స్ ప్రోగ్రాంలో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె పేర్కొన్నారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ స్పాన్సర్ చేసిన సకురా సైన్స్ ఎక్స్ఛేంజీ ప్రోగ్రాంను విజయవంతంగా పూర్తిచేసినట్లు తెలిపారు. విద్యార్థుల బృందాన్ని చైర్మన్ విష్ణురాజు, వైస్ చైర్మన్ రవిచంద్రన్, సెక్రటరీ ఆదిత్య, డీన్ రాజుఏద్లా, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ అభినందించినట్లు చెప్పారు.

## పుల్లూరు బండపై జాతర..

సిద్దిపేట రూరల్,జనవరి 29(ఆంధ్రజ్యోతి) : పుష్య బహుళ అమావాస్యను పురస్కరించుకుని బుధవారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు బండ పై జాతర మొదటి రోజున భక్తులు పోటెత్తారు. గుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వయంభూ శ్రీ లక్ష్మి నరసింహస్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సిద్దిపేట జిల్లా నలుమూలల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా బండ పైకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.







ఏడుపాయల వద్ద మంజీరాలో భక్తుల పుణ్యస్నానాలు



దుబ్బాక : కూడవెల్లి రామలింగేశ్వరాలయంలో భక్తుల రద్దీ

# వెల్లివిరిసిన ఆధ్యాత్మికం

- భక్తిశ్రద్ధలతో మాఘ అమావాస్య పర్వదినం
- ఆలయాల కోనేర్లలో భక్తుల పుణ్య స్నానాలు
- ఏడుపాయల, కూడవెల్లిలో కిక్కిరిసిన భక్తులు
- దర్శనం కోసం బారులు



ఏడుపాయలలో..

పాపన్నపేట/దుబ్బాక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : అత్యంత పవిత్రంగా భావించే మాఘ అమావాస్య పర్వదినం సందర్భంగా బుధవారం ఏడుపాయల వన దుర్గామాతను లక్షలాది భక్తులు దర్శించుకున్నారు. ఏడుపాయలుగా చీలి గలగలపారే నదీ పాయల్లో పుణ్య స్నానాలు ఆచరించారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు భారీగా తరలివచ్చారు. సింగూరు నుంచి వదిలిన నీరు ఘనపురం ఆనకట్టకు చేరుకున్నది. అక్కడి నుంచి దిగువకు వదలటంతో ఏడుపాయల్లో మంజీర పరవళ్లు తొక్కింది. ఆనకట్ట దిగువన చెక్‌డ్యాం వద్ద, నదీపాయల పొడవునా భక్తులు పుణ్యస్నానాలాచరించారు. అనంతరం అమ్మవారి దర్శనం కోసం మూడు గంటలు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. ఒడి బియ్యం, బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా మెదక్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఏడుపాయల ఇన్‌చార్జి ఈవో చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు భారీ



ఏడుపాయలలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

బందోబస్తు నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లను మెదక్ అదనపు కలెక్టర్ నగేష్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షించారు. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. పుణ్యస్నానాలు చేసే పాయల వద్ద ముందు జాగ్రత్తగా గజ ఈతగాళ్లు విధులు నిర్వహించారు. మెదక్, నర్సాపూర్ మీదుగా ఏడుపాయలకు ప్రత్యేక బస్సులు నడిపించారు. అడుగడుగునా దుకాణ సముదాయాలు వెలిశాయి. సంతాన గుండంలో సంతానం లేని దంపతులు పుణ్యస్నానాలు ఆచరించారు. దారులన్నీ ఏడుపాయల వైపే అన్న విధంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి దర్శనానికి భక్తులు రావడం కనిపించింది. భక్తులకు ఆలయ పూజారులు ఆశీర్వచనాలు అందించి, తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. లడ్డూ కౌంటర్ల ద్వారా భక్తులు ప్రసాదాన్ని కొనుగోళ్లు చేసుకోవడానికి బారులు తీరారు.



పాపన్నపేట: పుణ్యస్నానాల ఆచరిస్తున్న భక్తులు

### కూడవెల్లి.. ప్రణమిల్లి..

అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలోని కూడవెల్లి రామలింగేశ్వరాలయం గురువారం జనసంద్రమైంది. మాఘమాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున మూడు గంటల నుంచే పుణ్యస్నానాలు ఆచరించారు. తెల్లవారేలోగా భూంపల్లి చౌరస్తానుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల పొడువు వాహనాలు నిలిచిపోయాయి. ఆలయానికి చేరుకునే పలు రహదారులు వాహనాల రద్దీతో నిండాయి. దుబ్బాక సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించారు. భూంపల్లి కమాన్ నుంచి ఆలయం వరకు వాహనాలు వెళ్లాలంటే సుమారు గంట సమయం పట్టింది. దీంతో భక్తులు తమకు వీలున్నచోట ఖాళీ స్థలంలోనే వాహనాలకు నిలిపి రెండు కిలోమీటర్ల కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సాకేత్‌శర్మ, ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథశర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య స్వామివారిని దర్శించుకున్నారు.



రామలింగేశ్వరుడికి పూజలు చేస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

**నీట మునిగి భక్తుడు మృతి..**

దుబ్బాక మండలం పెద్దగుండవెల్లికి చెందిన బిట్ల శివరాములు(65) బుధవారం తెల్లవారుజామున కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద పుణ్యస్నానం ఆచరిస్తుండగా మూర్ఛవ్యాధితో నీటిలో మునిగి మృతిచెందాడు. పోలీసులు ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● మర్కుక్ : కూడవెల్లి వాగు జన్మస్థలమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం చేబర్తి పెద్ద చెరువుకు గ్రామస్థులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. రామేశ్వరంగ్రామంలోని కూడవెల్లివాగు జాతర ప్రారంభమైన సందర్భంగా ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



కూడవెల్లి రామలింగేశ్వరుడి ఆలయంలో భక్తుల పూజలు

## అఘోరిపై కేసు నమోదు

చేర్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయ సందర్శనార్థం వచ్చిన మహిళా అఘోరి తల్వార్‌తో హల్‌చల్‌చేసిన విషయమై సిద్దిపేట సీపీ అనూరాధ సీరియస్ అయ్యారు. తల్వార్‌తో దాడి చేసిన సంఘటనలో గ్రామానికి చెందిన యాదగిరి గాయాలపాలవడంతో పాటు వీడియో జర్నలిస్ట్ ఫోన్ ధ్వంసమైన విషయం విధితమే. ఈమేరకు సిద్దిపేట సీపీ అనూరాధ స్పందించి మహిళా అఘోరిపై కేసు నమోదుకు ఆదేశాలిచ్చారు. దీంతో కొమురవెల్లి పోలీసులు నాలుగు సెక్షన్లకింద కేసు నమోదు చేశారు. అఘోరి మల్లన్న దర్శనానికి రావడం, అనూహ్యంగా దాడికి పాల్పడడం, పోలీసుల కేసునమోదు కావడం చర్చనీయాంశమైంది.




సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

## పంచాయతీ అభివృద్ధిలో కార్యదర్శుల పనితీరు కీలకం

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ అభివృద్ధిలో కార్యదర్శుల పనితీరు కీలకమని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో డివిజనల్, మండల స్థాయి పంచాయతీ అధికారులు, సెక్రటరీలు, కంప్యూటర్ ఆపరేటర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. నిత్యం నిర్వహించే శానిటేషన్, ఇంటి పన్ను వసూలు, తనిఖీలు, ట్రేడ్ లైసెన్స్, సెల్‌టవర్ లైసెన్స్, ఇంటి అనుమతులు, మల్టీపర్పస్ వర్కర్స్ జీతాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో కార్యదర్శుల పనితీరు హర్షనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో కొనసాగించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్, డీపీవో యాదయ్య, సంబంధిత అధికారులు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నలుగురు మెదక్ ఉద్యోగులను కలెక్టర్ అభినందించారు.

**దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి**

దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మహిళా స్త్రీశిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, వైద్యారోగ్యశాఖ సమన్వయంతో బుధవారం స్థానిక టీఎన్జీవో భవనంలో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు ఉచిత బ్యాటరీ ట్రై సైకిల్ ఎంపిక, కృత్రిమ అవయవాల కొలతల శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో హైమావతి, డీఆర్డీవో శ్రీనివాసరావు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



## జనసంద్రమైన సింగరాయ

● కిటకిటలాడిన మోయ తుమ్మెదవాగు

కోహెడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కూరెల్ల, తంగళ్లపల్లి, గుండారెడ్డిపల్లి, బస్వాపూర్, గ్రామాల పరిధిలోని ప్రతాప సింగరాయ (లక్ష్మీనర్సింహ స్వామి) ఆలయం జనసంద్రమైంది. బుధవారం పుష్య బహుళ అమావాస్య రోజును పురస్కరించుకుని నిర్వహించిన స్వామివారి జాతర భక్తులు భారీగా తరలివచ్చారు. ఈసారి రెవెన్యూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు తెలంగాణలోని పలు జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు వేకువజామునే జాతరకు వచ్చి తూర్పు నుంచి పడమరకు ప్రవహించే మోయతుమ్మెద వాగు, ఇక్కడి గాజులబండ గుండంలో స్నానాలు చేశారు. నడకదారిన ఎత్తు వంపులు గల కొండలు ఎక్కి గుహలో కొలువుదీరిన లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు. దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులుదీరారు. ఒకేసారి భక్తులు తోసుకురావడంతో పలువురు మహిళలు కిందపడ్డారు. ఇద్దరు యువతులు అస్వస్థతకు గురయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాస్, కోహెడ ఎస్ఐ అభిలాష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ప్రతాపరుద్ర లక్ష్మీనరసింహస్వామికి మొక్కుతున్న యువతి



వంట చేస్తున్న మహిళ, స్నానం ఆచరిస్తున్న భక్తులు, సొమ్మసిల్లిన యువతికి సపర్యలు

## రేసులో మేము సైతం..

(5వ పేజీ తరువాయి)

మల్కా కొమురయ్యను బీజేపీ తమ అభ్యర్థిగా ప్రకటించింది. బీజేపీ అనుబంధ ఉపాధ్యాయ సంఘం, ఇతర టీచర్లపై ఆశలు పెట్టుకున్నారు. సిద్దిపేటకు చెందిన బడ్జెట్ పాఠశాలల సంఘం రాష్ట్ర కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి సైతం బరిలో ఉన్నారు. ప్రైవేట్ టీచర్ల మద్దతును ఆశిస్తున్నారు. టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థిగా టీపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్‌ను ప్రకటించారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులెవరో?**

బీజేపీ పార్టీ తమ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించింది. కాగా రాష్ట్రంలో అధికార పార్టీగా ఉన్న కాంగ్రెస్ తమ అభ్యర్థులపై స్పష్టం చేయలేదు. కాంగ్రెస్ మద్దతు కోసం పలువురు ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఆశీస్సులు ఎవరికి ఉంటాయో రేపోమాపో తేటతెల్లం కానున్నది. కాగా పట్టభద్రుల స్థానం నుంచి ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జీవన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ స్థానాన్ని నిలబెట్టుకోవాలనే ప్రయత్నంలో కాంగ్రెస్ ఉండగా.. బీఆర్ఎస్ కూడా అదే స్థాయిలో పావులు కదుపుతున్నట్లుగా తెలుస్తోంది. తమ అభ్యర్థులుగా యాదగిరి శేఖర్ రావు, బీఎన్ రావు, సర్దార్ రవీందర్‌సింగ్ పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. రాబోయే రెండుమూడు రోజుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతిచ్చే అభ్యర్థులెవరో స్పష్టం కానున్నది.

## కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

గజ్వేల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. కొండపాక మండలం గిరాయిపల్లికి చెందిన మైలారం సతీష్ కొద్ది రోజుల క్రితం కరెంట్ షాక్‌తో మృతిచెందాడు. ఆయనకు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉన్నందున బీమా సొమ్ము మంజూరైంది. ఈ మేరకు బుధవారం గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.2లక్షల విలువైన చెక్కును ప్రతాప్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అన్ని విధాల అండగా ఉంటామన్నారు. ఆయనవెంట మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, నాయకులు తదితరులున్నారు.

## పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలి

కుకునూరుపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు వినూత్న ఆలోచనతో పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని కుకునూరుపల్లి ఎంఈవో బచ్చలి సత్తయ్య తెలిపారు. బుధవారం తిప్పారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రూపొందించిన ప్రత్యేక క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. తిప్పారం పాఠశాల ఉపాధ్యాయులు ఒక్కో విద్యార్థి ఫొటోతో పాటు పాఠశాలలో జరిగిన కార్యక్రమాల ఫొటోలను పొందుపర్చి ప్రత్యేక క్యాలెండర్ రూపొందించిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజబహదూర్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యకృష్ణ, రామచంద్రం, మల్లారెడ్డి, సిహెచ్ రవి,రామకృష్ణారెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

## 'లక్ష డప్పులు- వేల గొంతులు' విజయవంతం చేయాలి

జగదేవ్‌పూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు, వేల గొంతుల కార్యక్రమానికి మాదిగ ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల జేఏసీ, ఎంజేఎఫ్, ఎంఈఎఫ్ నేతలు యాదగిరి, రాజు, బాలకిషన్, బాబు, రామస్వామి పిలుపునిచ్చారు. బుధవారం చాట్లపల్లి, జంగంరెడ్డిపల్లి, తిగుల్, నర్సాపూర్ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. ఊరూరా డప్పుల చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు.

## పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీకాంత్

సిద్దిపేట అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గత 50 ఏళ్లలో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా అవకాశం రావడం ఇదే మొదటిసారి అని రాష్ట్ర పీడీఎస్‌యూ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీకాంత్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాకు చెందిన ఎస్వీ శ్రీకాంత్ ఖమ్మంలో జరిగిన సంస్థ ఐక్యత సభలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ప్రధానమైన బాధ్యతలు అప్పగించిన పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

## సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఆముదాల మల్లారెడ్డి

సిద్దిపేట అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సీపీఎం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలలో సిద్దిపేట జిల్లాకు చెందిన ప్రస్తుత పార్టీ జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్న ఆముదాల మల్లారెడ్డి రాష్ట్ర పార్టీ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ తనను పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు.

# మెదినీపూర్ సబ్‌సెంటర్.. ప్రారంభానికి నోచుకునేదెన్నడో?

- మూడేళ్ల క్రితం కుకునూరుపల్లి మండలానికి 3 సబ్‌సెంటర్లు మంజూరు
- మెదినీపూర్‌లో పనులు పూర్తయినా సౌకర్యాలు లేక ప్రారంభం కాని వైనం
- స్థలం లేక ఆగిన మరో రెండు సబ్‌సెంటర్లు



మెదినీపూర్‌లో కనీసవసతులు లేక ప్రారంభానికి నోచుకోని సబ్‌సెంటర్

కుకునూరుపల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం మండలంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సబ్‌సెంటర్ నిర్మాణం పనులు పూర్తయి దాదాపు ఏడాది గడిచినా అందులో కనీస వసతులు లేక నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. వివరాల్లోకి వెళ్తే..

### మండలానికి 3 సబ్‌సెంటర్లు మంజూరు

కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ప్రజల సౌకర్యార్థం 2022లో మూడు గ్రామాలకు సబ్‌సెంటర్లు మంజూరు చేశారు. మెదినీపూర్, తిప్పారం, కొడకండ్లలో సబ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. మెదినీపూర్ సబ్‌సెంటర్ పరిధిలో కొనాయపల్లి, మాత్‌పల్లి, తిప్పారం సబ్ సెంటర్ పరిధిలో సింగారం, ముద్దాపూర్, బొబ్బాయిపల్లి ఉన్నాయి. కొడకండ్ల సబ్‌సెంటర్ పరిధిలో రిమ్మనగూడ గ్రామం ఉన్నాయి.

### మెదినీపూర్‌లో రూ.20 లక్షలతో పనులు

మండలానికి మంజూరైన మూడు సబ్‌సెంటర్‌లకు గానూ మెదినీపూర్ గ్రామంలో మాత్రమే సబ్‌సెంటర్ పనులను ప్రారంభించి నిర్మాణాన్ని దాదాపు పూర్తి చేశారు. మెదినీపూర్ సబ్‌సెంటర్ నిర్మాణానికి రూ.20లక్షలతో ప్రభుత్వ అనుమతులు రాగా పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ ఏడాది క్రితమే భవన నిర్మాణాన్ని దాదాపుగా పూర్తి చేశారు. పనులు పూర్తయినప్పటికీ కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి అందాల్సిన బకాయిలు పూర్తిగా అందకపోవడంతో చిన్న చితకా అత్యవసర పనులను నిలిపివేశాడు.

### రూ.లక్ష ఖర్చు చేస్తే అందుబాటులోకి..

మెదినీపూర్‌లో నిర్మించిన సబ్‌సెంటర్ భవనం ఏడాది క్రితమే పూర్తి అయినది కానీ విద్యుత్, నీరు, కిటికీలు వంటి పలు వసతులు లేకపోవడంతో అంగన్‌వాడీ సెంటర్‌లో సబ్‌సెంటర్‌ను కొనసాగిస్తున్నారు. మరో రూ. లక్షల నిధులతో వసతులను పూర్తి చేస్తే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నది.

### మరో రెండు సెంటర్లకు స్థలం లేక..

మండలంలోని తిప్పారంతో పాటు కొడకండ్లలో నిర్మించాల్సిన సబ్‌సెంటర్ల పనులు ఇంకా ప్రారంభించనేలేదు. తిప్పారంలో ప్రారంభం కావాల్సిన సబ్‌సెంటర్ భూమి లేకపోవడంతో ప్రారంభించ లేదు. వీటికి నిధులు మంజూరు అయినప్పటికీ నిర్మించడానికి గ్రామపంచాయతీ వారి భూమి లేకపోవడంతో పనులు ఇంకా ప్రారంభించలేదు. పూర్తి అయిన సబ్‌సెంటర్‌లో వసతులు కల్పించి మంజూరు అయిన సబ్‌సెంటర్‌లను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆస్తిపన్ను వసూళ్లలో వేగం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, జనవరి29(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ఆస్తిపన్ను వసూళ్లలో వేగం పెంచాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బంది, బిల్లు కలెక్టర్లు, మహిళలకు సంబంధించి బ్యాంకులోన్లపై బ్యాంకు సిబ్బందితో కలిసి మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ మాట్లాడుతూ ఇంటి పన్ను వసూళ్లలో ప్రతీ వార్డులోని ఆర్పీ, రెవెన్యూ సిబ్బంది ఫిబ్రవరి నెలాఖరులోగా 90 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. మార్చి 31వరకు తప్పనిసరిగా వందశాతం పన్ను వసూలు పూర్తి చేయాల్సిందేనన్నారు. బ్యాంకుల నుంచి మహిళలకు సులభంగా రుణాలు అందేలా చూస్తామని, బ్యాంకు లింకేజులకు సంబంధించిన లక్ష్యాన్ని ఫిబ్రవరి నెలాఖరు వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు పెద్ద ప్రాజెక్టులుగా క్యాంటీన్ బస్సులు పెట్టవచ్చని అందుకు ఆర్టీసీ వారు బస్సులను సైతం ఇస్తారన్నారు. మహిళలకు సోలార్ మెగా ప్లాంట్ ఏర్పాటు చేయడానికి స్థలాన్ని సైతం ఇస్తామని తెలిపారు. సమావేశంలో అధికారులు ప్రేరణ, శ్రీనాథ్, హనుమంత్‌రెడ్డి, వెంకట్రావు, శ్రీకాంత్, బాలకృష్ణ, అజ్మత్ అలీ, సాయికృష్ణ, రమ్య, జ్యోతి, బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● గజ్వేల్ : పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య సూచించారు. గజ్వేల్ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో బుధవారం బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సైతం పన్నులను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయన వెంట మెనేజర్, ఆర్ఐ, ఏవో, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జంతువులను సంరక్షించుకుందాం

పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్



సదస్సులో మాట్లాడుతున్న చేర్యాల అసిస్టెంట్ డైరెక్టర్ రాజిరెడ్డి

చేర్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జంతు, పశువులను సంరక్షించుకుందామని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజిరెడ్డి అన్నారు. జంతు సంక్షేమ పక్షోత్సవాలలో భాగంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువులు, పశు సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు వాటిద్వారా మనుషులకు సంక్రమించే వ్యాధులను వివరించారు. జంతుసంరక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. వీధి కుక్కల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

● దూళిమిట్ట: మండలంలోని బెక్కల్ గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు పశువులకు గర్భధారణ పరీక్షలతో పాటు పలు రకాల పరీక్షలు చేసి అవసరమైన మందులను అందజేశారు. అనంతరం పశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పశు వైద్య డాక్టర్లు ఉషరాణి, హరికిషన్, నితిన్ కుమార్, వీఎల్‌వో పర్వయ్య, గోపాలమిత్ర సూపర్‌వైజర్ జైపాల్ రెడ్డి, గోపాలమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

● మద్దూరు: మండలంలోని రేబర్తి గ్రామంలో ఉపాధిహామీ నిధులతో నిర్మించుకున్న పశువుల షెడ్డును ఈసీ పరశురాములు సందర్శించి పరిశీలించారు. ఉపాధిహామీలో గ్రామానికి చెందిన ఒగ్గు బాపురాజు పశువుల షెడ్డుకు రూ.84,099లు మంజూరైనట్లు తెలిపారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గజ్వేల్ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణ శివారులో పేకాట స్థావరంపై బుధవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ. 3,120, మూడు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

## రోడ్డు భద్రతపై అవగాహన



గజ్వేల్‌లో అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ మురళీ

గజ్వేల్/చేర్యాల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఒక్క రోడ్డు ప్రమాదం కుటుంబాన్నే చిందరవందర చేస్తుందని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తాలో ట్రాఫిక్ నియమ, నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇంట్లో యజమాని ఏదైనా రోడ్డు ప్రమాదానికి గురైతే మొత్తం కుటుంబమే రోడ్డున పడే ప్రమాదముందని హెచ్చరించారు. ఆయనవెంట ట్రాఫిక్ ఏఎస్ఐ జగదీశ్వర్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు. చేర్యాల పట్టణంలోని ఎంవీఐ కార్యాలయ ఆవరణలో బుధవారం లారీ, ఆటో, మోటార్‌క్యాబ్, స్కూల్ బస్, ట్రాక్టర్ డ్రైవర్లకు ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం రహదారి భద్రత మాసోత్సవాల పట్ల అవగాహన కల్పించారు. ప్రతీ వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు కలిగిఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ కార్యాలయ సిబ్బంది నేహా,ఎర్రన్నగారి జితేందర్‌రెడ్డి, విక్టోరియా, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ బోర్డులో ప్రజా ప్రతినిధుల జోక్యం తగదు

సిద్దిపేట అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సిన డబ్బులను ప్రభుత్వం ఇతర ప్రయోజనాలకు ఖర్చు చేయడం సమంజసం కాదని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేటలో విపంచి కళా నిలయంలో బుధవారం జరిగిన బీఎంఎస్ అనుబంధ సంఘం భవన నిర్మాణ కార్మికసంఘ్ ద్వితీయ రాష్ట్ర మహాసభల్లో వారు పాల్గొని మాట్లాడారు. ప్రమాదవశాత్తు కార్మికులు మరణించినా, అంగవైకల్యం చెందినా రూ.5లక్షల నుంచి 10 లక్షల వరకు బీమా అందించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణాలు చేపడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల నుండి అధికారులు సెస్ వసూలు చేయడంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెల్ఫేర్ బోర్డులో ఉన్న రూ. 1,004 కోట్లను గత ప్రభుత్వం తమ సొంతానికి ఖర్చు చేసిందని, ఆ డబ్బును తిరిగి జమచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

## స్నేహితుడి కుటుంబానికి అండగా..



కుటుంబ సభ్యులకు డిపాజిట్ పత్రాన్ని అందజేస్తున్న మిత్రులు

కొండపాక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడు చనిపోవడంతో ఆ కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. కొండపాక మండలం దమ్మకపల్లి గ్రామానికి చెందిన చిలుముల మల్లేశం కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. మల్లేశం కొండపాక ఉన్నత పాఠశాలలో చదివిన సమయంలో ఉన్న మిలీనియం బ్యాచ్ 2000-01 సంవత్సరానికి చెందిన మిత్రులు అంతా కలిసి రూ. 55 వేలను ఫిక్స్‌డిపాజిట్ చేసి కుటుంబ సభ్యులకు అందజేశారు.

## పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి



గజ్వేల్ మండలంలోని దాచారం పాఠశాలలో సమస్యలను తెలుసుకుంటున్న టీపీటీఎఫ్ నాయకులు

సిద్దిపేట కల్చరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు చిట్యాల విజయేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా ట్రెజరీ కార్యాలయంలో డీటీవోను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం టీపీటీఎఫ్ డైరీని డీటీవోకు అందజేశారు.

● గజ్వేల్ రూరల్: మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాపగారి పాపిరెడ్డి, జోన్ కన్వీనర్ జల్లెల శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్ టీపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్, బూరుగుపల్లి, కొడకండ్ల, ప్రజ్ఞాపూర్, తిమ్మక్కపల్లి, కోదండరామ్‌పల్లి, గుండనపల్లి, రిమ్మనగూడ, ధర్మారెడ్డిపల్లి, కోమటిబండ, దాచారం పాఠశాలలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు.

## విద్యాధరి ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం



మంత్రి పొన్నంకు వసంత పంచమి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, విద్యాధరి ఆలయకమిటీ సభ్యులు

వర్గల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వర్గల్ విద్యాధరి ఆలయ అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని విద్యాసరస్వతీ అమ్మవారి ఆలయంలో ఈ నెల 3న నిర్వహించనున్న వసంత పంచమి(శ్రీపంచమి) మహోత్సవ వేడుకలకు విచ్చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని అమ్మవారిని అనేకసార్లు దర్శించుకుని ఆశీస్సులు పొందానన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, మాజీ మంత్రి సునీతారెడ్డికి వసంత పంచమి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దాచెపల్లి వెంకటకృష్ణ, గంగిశెట్టి సుధాకర్, కైలాస శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## గీతకార్మిక కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో మంజూరు చేయాలి

చేర్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామ మాజీసర్పంచు చెరుకు రమణారెడ్డి బుధవారం రాష్ట్ర రవాణా, బీసీసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. కొద్దిరోజులక్రితం రసూలాబాద్‌కు చెందిన గీతకార్మికుడు పచ్చిమడ్ల మల్లయ్య తాటిచెట్టుపై నుంచి పడి గాయాలపాలై మంచానికే పరిమితమయ్యాడు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియో మంజూరు చేయించాలని వినతిపత్రం అందించారు. ఆయనవెంట పచ్చిమడ్ల స్వామి, ఉల్లంపల్లి స్వామి ఉన్నారు.

## బీటీ రోడ్ల మరమ్మతులకు రూ.5.13 కోట్ల నిధులు

● మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో బీటీ రోడ్ల మరమ్మతులకు రూ. 5.13 కోట్ల నిధులు మంజూరైనట్లు మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని నారాయణరావుపేట, చిన్నకోడూరు మండలంలోని చౌడారం వెళ్లే పీడబ్ల్యూడీ రహదారిలో దాదాపు మూడున్నర కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ. 1.58 కోట్లు, నారాయణరావుపేట మండలంలోని కోదండరావుపల్లి-లక్ష్మీదేవిపల్లి ఎస్సీకాలనీ వరకు 1.5 కిలోమీటర్లకు రూ. 66.30లక్షలు, నంగునూర్ మండలంలోని అక్కెనపల్లి-కరీంనగర్ జిల్లా శివారు వరకు 1.5కిలో మీటర్లకు రూ. 59లక్షలు, సిద్దిపేట అర్బన్ మండలంలోని బూరుగుపల్లి వడ్డెర కాలనీ నుంచి ఎన్సాన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని తిప్పరవేణి కాలనీ వరకు 1.5 కిలోమీటర్లకు గానూ రూ.66.74లక్షలు, సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవాపూర్- హసన్‌మీరాపూర్ దాదాపు 4 కిలోమీటర్లకు రూ. 1.63 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. ఈ పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులను హరీశ్‌రావు ఆదేశించారు.

## గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన అనుచితవ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని వివిధ ప్రజా సంఘాలు డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు శ్రీహరి యాదవ్, ఆస లక్ష్మణ్, శ్రీకాంత్, శంకర్, శంకర్, భీమ్ శేఖర్, సతీష్ మాట్లాడుతూ.. పేదల కోసం, నవ సమాజ నిర్మాణం కోసం జీవితాంతం గద్దరన్న పోరాటం చేశారని గుర్తు చేశారు. గద్దర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు బండి సంజయ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించనున్న గద్దర్ జయంతిని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు.

● గజ్వేల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గద్దర్‌పై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని అంబేడ్కర్ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు చిప్పల యాదగిరి పేర్కొన్నారు. గజ్వేల్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా యుద్ధనౌక గద్దర్ తన ఆట, పాట, మాట ద్వారా ఎంతో మంది ప్రజలను చైతన్య వంతులను చేశారన్నారు. బండి సంజయ్ బీజేపీ కేంద్ర సహాయ మంత్రి హోదాలో ఉండి అవగాహన లేకుండా గద్దర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## నైపుణ్యం ఉంటే పుష్కలమైన ఉద్యోగావకాశాలు



విద్యార్థులకు నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు పుష్కలమైన ఉద్యోగావకాశాలు ఉంటాయని ఇండియన్ ఫారెన్ ఫర్ బెటర్ సొసైటీ ఎన్జీవో ఆర్గనైజేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలోని టీఎస్‌కేసీ, కెరియర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కొన్ని రకాలైన నైపుణ్యాలను అలవరచుకుంటే మంచి ఉద్యోగాన్ని పొందవచ్చని, ఉత్తమమైన జీవితాన్ని అనుభవించవచ్చన్నారు. ఈ మధ్య కాలంలో ఏఐ టెక్నాలజీ మీద ఆధారపడిందని, ఈ టెక్నాలజీలో ప్రావీణ్యం సంపాదించుకుంటే ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ఎవరైనా స్టేట్, సెంట్రల్, ఆర్‌బీఐ, ఎస్‌బీఐ, డీసీసీబీ, నాబార్డ్, ఎల్ఐసీ, ఆర్ఆర్‌బీ, ఆర్మీ, యూపీఎస్సీ స్టాఫ్ సెలక్షన్ టీచింగ్, ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు సంపాదించడానికి అవసరమైన శిక్షణను ఇస్తామన్నారు. వారితో ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్, వైస్ ప్రిన్సిపల్ గణపతిరావు, అకాడమిక్ కోఆర్డినేటర్ విజయభాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## మూఢనమ్మకాలు వీడాలి : చేర్యాల సీఐ

చేర్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలో ఇటీవల క్షుద్రపూజల కలకలం నెలకొన్న నేపథ్యంలో చేర్యాల పోలీసులు బుధవారం కనువిప్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కళాబృందం ప్రదర్శన చేపట్టారు. అనంతరం చేర్యాల సీఐ శ్రీను మాట్లాడుతూ మంత్రాలు, తంత్రాలు లేవని, ప్రజలు మూఢనమ్మకాలు వీడాలని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

## లద్నూరు ఉన్నత పాఠశాలలో స్వయంపాలన



కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మద్దూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్నూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈవోగా జి.లిఖిత, డిప్యూటీ ఈవోగా వి.అలేఖ్య, ఎంఈవోగా డి.మనిషా, ఉపాధ్యాయులుగా విద్యార్థులు చక్కటి ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో మాఘ అమావాస్య సందడి



చిన్నకోడూరు మండలం సలేంద్రిలో శ్రీరామలింగేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల పూజలు



తొగుట: వెంకట్రావ్‌పేటలో ఎడ్లబండ్ల ఊరేగింపులో దుబ్బాక ఎమ్మెల్యే



మిరుదొడ్డి మండలంలోని అల్వాల సీతారామచంద్రస్వామి ఆలయ జాతరలో భక్తులు

సిద్దిపేట/నంగునూరు/చిన్నకోడూరు/తొగుట, జనవరి 29: మాఘ అమావాస్యను పురస్కరించుకొని బుధవారం జిల్లావ్యాప్తంగా పలు దైవ క్షేత్రాల్లో భక్తుల సందడి నెలకొన్నది. మౌని అమావాస్యగా వ్యవహరించే ఈ రోజున పుణ్య స్నానాలు చేస్తే పాపాలు హరిస్తాయని భక్తుల విశ్వాసం. దీంతో ఆయా ఆలయాల పరిసరాల్లో నిర్వహించిన జాతరకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పుణ్యస్నానాల అనంతరం దైవదర్శనాలు చేసుకున్నారు. మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో మాఘ అమావాస్యను పురస్కరించుకుని బుధవారం సీతారామచంద్రస్వామి ఆలయ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కూడవెళ్లి వాగులో భక్తులు పుణ్యస్నానాలను భక్తులు ఆచరించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. జాతర పురస్కరించుకుని ఆలయం వద్ద గ్రామస్థులు బండ్లబోనాలను ఊరేగించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య స్వామి వారిని దర్శించుకున్నారు అలాగే అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని రుద్రారం గ్రామంలో గ్రామదేవతలకు బండ్ల బోనాలను గ్రామస్థులు ఊరేగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో చీకోటి వంశస్థుల ఆధ్వర్యంలో గుబ్బడిగుట్ట జాతరను ఘనంగా నిర్వహించారు. పాలమాకులలో కొలువైన దత్తాత్రేయుడి సన్నిధిలో భక్తులు బారులు తీరారు. పాలమాకుల, రాజగోపాల్‌పేట, వెంకటాపూర్, ముండ్రాయి నాలుగు గ్రామాల సరిహద్దులో జాతరకు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి పవిత్ర గుండంలో పుణ్య స్నానాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. చిన్నకోడూరు మండలం సలేంద్రిలో శ్రీ రామలింగేశ్వర స్వామి, విఠలాపూర్‌లో విఠలేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొగుట మండలం వెంకట్రావ్‌పేట గ్రామ శివారులోని ఆలయంలో వెంకటేశ్వరస్వామి జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. సాయంత్రం దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పూజలు చేశారు.



నంగునూరు: దత్తాత్రేయ స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు